సాక్షి
నారాయణపేట
సోమవారం । 11 । నవంబర్ । 2024



ఆదర్శం.. ఆ గ్రామం
ఉప్పునుంతల మండలం రాయిచేడ్‌లో 18 ఏళ్లుగా మద్యపాన నిషేధం అమలవుతోంది.
వివరాలు 8లో ▸



తిట్లతో తిప్పలు తీరవు
రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష నేతలు తిట్ల పురాణం అందుకున్నారని తమ్మినేని వీరభద్రం అన్నారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.1 /21.3

వాతావరణం
ఉదయం, రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

108, 102లో ఉద్యోగాలకు దరఖాస్తులు

నారాయణపేట: 108, 102 వాహనాల్లో డ్రైవర్‌గా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ రాఘవేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, అన్ని సర్టిఫికెట్లను ఒక జిరాక్స్ సెట్‌ను వెంట తీసుకొని మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకి హాజరుకావాలని తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి, 35 ఏళ్ల లోపు వయస్సు, డ్రైవింగ్ లైసెన్స్ , మూడేళ్ల అనుభవం, బ్యాడ్జి నెంబర్ కలిగి ఉండాలని తెలిపారు. తెలంగాణాలో ఎక్కడైనా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని, మిగతా వివరాలకు సెల్ నంబర్ 9705012874ను సంప్రదించాలని కోరారు.

ఓటర్ జాబితాలో తప్పులుంటే సరిచేసుకోండి



మక్తల్/దామరగిద్ద: ఓటర్ జాబితాలో తప్పులు ఉంటే సరిచేసుకునేందుకు, 18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఓటు హక్కు పొందేందుకు అవకాశం కల్పించారని, సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ బెన్ షాలం, ఆర్డీఓ రాంచందర్ సూచించారు. మక్తల్ మున్సిపాలిటీలోని 162, 164, 176 పోలింగ్ బూత్‌లను అడిషనల్ కలెక్టర్, దామరగిద్ద మండలంలో ఆర్డీఓ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లు, గతంలో ఉన్న ఓటర్ల జాబితాలో తప్పు ఒప్పులను సరిచేసేందుకు ఓటర్లకు అవకాశం ఉందన్నారు. వార్డుల వారీగా సర్దుబాటు చేసిన ఓటర్ల జాబితాను ప్రదర్శించాలని, ఓటర్ల ద్వారా అందిన పిర్యాదులను స్వీకరించాలని బీఎల్‌ఓలను ఆయన ఆదేశించారు. అలాగు, ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారని బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఓటరు లిస్టులో డబుల్ ఓటర్లు లేకుండా చూసుకోవాలని అన్నారు.

ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి



కృష్ణా: ప్రతీ ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని, దైవభక్తి కలిగి ఉంటేనే సమాజంలో శాంతి నెలకొంటుందని పీఠాధిపతులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా మహిళలు కృష్ణానది నుంచి కళశాలలో నీటితో ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం బంథనాళ్ పీఠాధిపతి వృషభలింగేశ్వర మహాస్వామి, నేరడగం పీఠాధిపతి పంచమ సిద్ధలింగ మహాస్వామి, గవ్వార్ పీఠాధిపతి సోపననాత మహాస్వాముల మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీఠాధిపతులు మాట్లాడుతూ.. ఈ ప్రపంచమే కృష్ణమయం అని, అలాంటి పేరును పొందిన ఈ గ్రామ ప్రజలు అదృష్టవంతులని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ చాంపియన్ హైదరాబాద్

- రన్నరప్‌గా పాలమూరు బాలికలు
- బాలుర రన్నరప్‌గా రంగారెడ్డి
- మూడోస్థానంలో వరంగల్, రంగారెడ్డి జట్లు
- ముగిసిన ఎస్‌జీఎఫ్ అండర్‌-19 రాష్ట్రస్థాయి టోర్నీ

వివరాలు 10లో ▸



కురుమూర్తిస్వామి ఆలయం వద్ద నిర్వహించిన సభకు హాజరైన ప్రజలు

ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

అభివృద్ధే లక్ష్యం..

ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్ట్‌లు పూర్తి చేస్తాం

- కురుమూర్తి, మన్యంకొండ ఆలయాలపై ప్రత్యేక దృష్టి
- ప్రతి గ్రామానికి, తండాకూ బీటీ రోడ్డు
- సమగ్ర అంచనాలు రూపొందించాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి, 5 జిల్లాల కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- మంత్రులు కోమటిరెడ్డి, దామోదరతో కలిసి కురుమూర్తి స్వామి దర్శనం
- రూ.110 కోట్ల ఎలివేటెడ్ కారిడార్, ఘాట్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన

మహబూబ్‌నగర్: పాలమూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన బూర్గుల రామకృష్ణారావు ఆనాడు హైదరాబాద్ రాష్టానికి ముఖ్యమంత్రి అయ్యారు.. ఆ తర్వాత మహబూబ్‌నగర్ బిడ్డల ఆశీర్వాదంతో ఇప్పుడు మీ బిడ్డ సీఎం అయ్యాడు అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఆరు దశాబ్దాల తర్వాత ఈ అవకాశం వచ్చిందని.. ఎవరు అడ్డుపడినా ఉమ్మడి పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసి తీరుతామన్నారు. జిల్లాలో అన్ని పెండింగ్ ప్రాజెక్ట్‌లను శరవేగంగా పూర్తి చేస్తామని, ఇటీవలే మక్తల్, కొడంగల్, నారాయణపేట స్కీమ్‌కు టెండర్లు పూర్తయ్యాయని.. త్వరలోనే ఆయా నియోజకవర్గాలకు కృష్ణాజలాలు పారుతాయని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండలం అమ్మాపురంలోని కురుమూర్తి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఆయన స్వామిని దర్శించుకున్నారు. రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి తొలుత దేవాలయ గోపురం వద్ద రూ.110 కోట్ల వ్యయంతో 3.7 కి.మీ.ల ఘాట్ రోడ్డు, ఎలివేటెడ్ కారిడార్, దేవస్థాన ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి, మంత్రులకు దేవస్థానం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి ఆశీస్సులు తీసుకున్న అనంతరం వారికి వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ నిరుపేదలు ఎవరైతే తిరుమల తిరుపతి వెళ్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకోలేరో.. అలాంటి వారు పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి ఆలయానికి వెళ్లి స్వామిని దర్శనం చేసుకుంటారని తెలిపారు. అలాంటి ప్రత్యేకత కలిగిన దేవాలయానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు దర్శించుకోలేకపోతున్నారని స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చెప్పడంతో వెంటనే ఎలివేటెడ్ కారిడార్, ఘాట్‌రోడ్ నిర్మాణానికి రూ.110 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.



కురుమూర్తిస్వామి సన్నిధిలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే యెన్నం

అంచనాలు రూపొందించాలి..

జిల్లాలో ప్రధానమైన మన్యంకొండ, కురుమూర్తి ఆలయాల అభివృద్ధికి అంచనాలు రూపొందించాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. దేవాదాయశాఖతో సమన్వయం చేసుకుని ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక అందజేయాలని.. స్వామివారి ఆశీర్వాదంతో నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేద్దామన్నారు. జిల్లాలో ప్రతి గ్రామానికి, తండాకు బీటీ రోడ్డు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ఇవ్వాలని ఐదు జిల్లాల కలెక్టర్లను సీఎం ఆదేశించారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖలకు సంబంధించి పాలమూరు జిల్లా కేంద్రంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి.. పక్కాగా అంచనాలు రూపొందించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదరం రాజనర్సింహకు సూచించారు.

నెహ్రూ స్ఫూర్తితో ముందుకు..

దేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రాజెక్టులు, ఆధునిక దేవాలయాలు..వాటిని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆనాడు చెప్పారని రేవంత్ గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తిగా ముందుకు సాగుతున్నామని.. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా ఎడారిగా మారిన పాలమూరు జిల్లాను కృష్ణానీటితో సస్యశ్యామలం చేసేవిధంగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. ఈ మేరకు ప్రతి నెలా ఈ జిల్లా ప్రాజెక్ట్‌లపై సమీక్షిస్తూ.. సత్వరమే పనులు పనులు పూర్తి చేసేలా ముందుకు సాగుతున్నామన్నారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు. జిల్లాలో విద్య అవకాశాలు పెరగాలని.. మేరకు ప్రభుత్వ లా, ఇంజినీరింగ్ కళాశాలలను పాలమూరు యూనివర్సిటీకి మంజూరు చేసినట్లు వివరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నిరుద్యోగులకు మాత్రమే ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలని అమర్ రాజా బ్యాటరీ సంస్థతో మాట్లాడామని.. అందుకు వారు సైతం ఒప్పుకున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో జిల్లాలో వచ్చే పరిశ్రమలు ఇక్కడి నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రులు ఏమన్నారంటే..

ఈ రోజు తనకు కురుమూర్తిస్వామి దర్శన భాగ్యం కలగడం చాలా సంతోషంగా ఉందని.. ఈ దేవస్థానానికి చాలా ప్రత్యేకతలు ఉన్నాయని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. కురుమూర్తి దేవస్థానానికి ఘాట్ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని అక్టోబర్ 11న స్థానిక శాసన సభ్యుడు కోరారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ ప్రాంత వ్యక్తి సీఎం కావడంతో వెంటనే ఈ రోజు రూ.110 కోట్లతో శంకుస్థాపన జరిగిందని.. వచ్చే బ్రహ్మోత్సవాల్లోపు ఘాట్ రోడ్ ప్రారంభోత్సవం చేసుకోనున్నట్లు వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే జీఎమ్మార్ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసినందుకు సీఎంతో పాటు మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇదెక్కడి బాధ దేవుడా!

సీఎం రాకతో 3 గంటలపాటు దర్శనాల నిలిపివేత

- కురుమూర్తిస్వామి భక్తులకు తప్పని తిప్పలు
- సుదూర ప్రాంతాల నుంచి వస్తే సభావేదిక వద్దకు తరలింపు
- ఇబ్బందులకు గురైన చిన్నారులు, మహిళలు



పోలీసులతో వాగ్వాదానికి దిగిన భక్తులు

దేవరకద్ర/ చిన్నచింతకుంట: కురుమూర్తివాసుడిని దర్శించుకోవాలని వచ్చిన భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. సీఎం రేవంత్‌రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి ఆదివారం కురుమూర్తికి రావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి స్వామివారి దర్శనాలను నిలిపివేసి వచ్చిన భక్తులను సీఎం సభావేదిక వద్దకు తరలించారు. హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి కార్లలో వచ్చిన భక్తులు తమ వాహనాలను దూరంగా నిలిపి నడుచుకుంటూ ఆలయ ప్రధాన ద్వారం వద్దకు రాగా.. అక్కడ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో చేసేది లేక సభా వేదిక ముందు ఎండలో నిలబడాల్సి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 12.50 గంటల ప్రాంతంలో ఆలయానికి చేరుకున్నారు. శంకుస్థాపన అనంతరం కొండపైకి వెళ్లి కురుమూర్తి స్వామిని దర్శించుకొని తిరిగి వచ్చే వరకు భక్తులు ఎండలో పడిగాపులు కాశారు. అలాగే బహిరంగ సమావేశం దాదాపు గంటకు పైగా సాగింది. సీఎం వెళ్లి పోయిన తర్వాత మధ్యాహ్నం 2.30 గంటలకు భక్తులను దర్శనానికి వదిలారు. దాదాపు మూడు గంటలపాటు పడిగాపులు పడ్డ భక్తులు ఒక్కసారిగా దర్శనానికి వెళ్లడంతో ఒకరినొకరు తోసుకునే పరిస్థితి వచ్చింది. పోలీసులు సైతం భక్తులను క్యూలైన్ ద్వారా పంపించడానికి తగు చర్యలు తీసుకోకపోవడంతో చాలామంది తోపులాడుకున్నారు. ఆదివారం రోజు సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు సీఎం రాకతో చాలా ఇబ్బందులకు గురయ్యామని వాపోయారు.



భక్తులు స్వామివారి దర్శనానికి వెళ్లకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లు

11 గంటలకు వస్తే..



కురుమూర్తిస్వామికి మొక్కులు తీర్చుకోవడానికి హైదరాబాద్ నుంచి కుటుంబంతో వచ్చాను. ఉదయం 11 గంటలకు దర్శనం కోసం వెళ్తే.. దర్శనాలు నిలిపివేశారు. సీఎం వచ్చిపోయే వరకు వేచి ఉండాలని పోలీసులు చెప్పారు. దీంతో పిల్లలతో మూడు గంటల పాటు ఎండలోనే వేచి ఉండాల్సి వచ్చింది. సీఎం వెళ్లిన తర్వాత 3 గంటలకు దర్శనం చేసుకున్నాం.

– నాగరాజు, భక్తుడు, హైదరాబాద్

తోసుకుంటూ వెళ్లారు..



ఆదివారం సెలవు రోజని కుటుంబసభ్యులతో కలిసి కురుమూర్తిస్వామిని దర్శనానికి వస్తే 3 గంటలపాటు నిలిపివేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండలో వేచి ఉన్నాం. సీఎం వెళ్లిన తర్వాత దర్శనానికి వెళ్తే ఒకరినొకరు తోసుకుంటూ వెళ్లారు. క్యూలైన్‌లో పర్యవేక్షణ లేక మధ్యలో రావడం వల్ల దర్శనం మరింత ఆలస్యమైంది.

– శ్రీనివాసులు, భక్తుడు, పోల్కంపల్లి

నిలువు దోపిడీ

- అధిక ధరలకు టెంకాయల విక్రయాలు
- తాగునీటి కోసం తప్పని పాట్లు



కురుమూర్తి రాజగోపురం సమీపంలో ఏర్పాటు చేసిన కుళాయిలో సన్నగా ధారగా వస్తున్న నీరు



దేవరకద్ర/ చిన్నచింతకుంట: కురుమూర్తి జాతరకు వచ్చిన భక్తులు ఒక దిక్కు నిలువుదోపిడీ, మరోదిక్కు అష్టకష్టాలకు గురయ్యారు. తాగునీటికి సైతం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాసంగాలు పెట్టడానికి జాతర మైదానికి దూరంగా విడిది ఏర్పాటు చేసుకున్న భక్తులు తాగునీటి కోసం అటు కోనేరు వద్దకు వెళ్లలేక.. మాంసం విక్రయాల వద్దకు, లేకపోతే ఆలయ రాజగోపురం సమీపంలో ఉన్న ట్యాంకు వద్దకు సుమారు అర కి.మీ., నడిచి వెళ్లాల్సి వచ్చింది. దీంతో కొందరు మినరల్ వాటర్‌ను కొనుక్కుంటున్నారు. అలాగే రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన నల్లాలు సన్నగా ధారగా వస్తుండటంతో భక్తులు కాళ్లు, చేతులు కడుక్కోడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు.

నామమాత్రంగా బోర్డులు..

కురుమూర్తి జాతరలో రూ.25కే టెంకాయతో పాటు అగరబత్తీలు, కవరు ఇవ్వాలని బ్యానర్లు, బోర్డులు పెట్టినా.. రూ.35కు అమ్ముతున్నారు. టెంకాయల టెండరు తీసుకున్న కాంట్రాక్టర్ చిరు వ్యాపారులతో టెంకాయల విక్రయాలు చేయిస్తున్నారు. ఆలయ సమీపంలో చాలామంది టెంకాయలు విక్రయిస్తుండగా వారికి కాంట్రాక్టర్ సరఫరా చేస్తున్నాడు. చేతికి దొరికిన కాడికి దోచేయ్ అనే పరిస్థితి కురుమూర్తి జాతరలో కొనసాగుతోంది. దేవస్థానం పాలక మండలి పట్టించుకోకపోవడంతో టెంకాయల విక్రయదారులు భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు.



కురుమూర్తిలో రూ.25కే టెంకాయల విక్రయం అంటూ బోర్డులు



సీఎం వెళ్లిన తర్వాత గుంపుగా ఆలయం వద్దకు వస్తున్న భక్తులు

తప్పులు లేకుండా సర్వే చేపట్టాలి



మక్తల్‌లో కుటుంబ సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మక్తల్: ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను తప్పులు లేకుండా చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఆదివారం మక్తల్ మున్సిపాలిటీలో సర్వే తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లకు పలు సలహాలు, సూచనలు చేశారు. సర్వే ఫారంలో ఏమైనా అనుమానాలు వస్తే నివృత్తి చేసుకుని పూర్తి వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎన్యూమరేటర్‌కు ఆదేశించారు. సర్వేకు ఒక రోజు ముందు గ్రామాలు, పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, అలాగే తాళం వేసిన ఇంటికి మరో రోజు వెళ్లి సర్వే చేయాలన్నారు.

అర్హులందరూ ఓటు హక్కు పొందాలి

అనంతరం మక్తల్‌లో బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్ కలెక్టర్ పరిశీలించారు. బీఎల్‌ఓలను ఎన్ని దరఖాస్తులు వచ్చాయని ఆరా తీశారు. జనవరి 1, 2025 నాటికి 18సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఫారం 6 ద్వారా ఓటరు నమోదు, ఫారం 7 ద్వారా అభ్యంతరాలు, ఫారం 8 ద్వారా అడ్రస్ మార్పు చేసుకోవచ్చని సూచించారు. అలాగే, డబుల్ ఓటర్లు లేకుండా చూడాలని, చనిపోయిన వారిని ఓటరు లిస్టుల్లో తొలగించాలని అన్నారు. కార్యక్రమంలో డీఏఓ జాన్‌సుధాకర్, తహసీల్దార్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



నారాయణపేట: జిల్లాలో బీజేపీని మరింత పటిష్టం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాగుడాకుల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి సంస్థాగత కార్యశాల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పార్టీ సభ్యత్వం మరింత పెంచాలని, అలాగే ఈ నెలలో జరిగే పార్టీ సంస్థాగత ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. దాంతో పార్టీని మరింత పటిష్టం చేసి స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలు దక్కించుకోవాలని, తద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేసిందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్గ దర్శనం చేశారు. ఏ.వెంకట్ రాములు, బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి, పున్నం చంద్, ఉదయ బాను, రామ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుల గణన చేపట్టాలి



నినాదాలు చేస్తున్న బీసీ జాగృతి సేన నాయకులు

నారాయణపేట: సమగ్ర కుటుంబ సర్వేతో పాటు సమగ్ర కులగణన చేపట్టి రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజల జనాభా లెక్కలను బహిరంగంగా ప్రకటించాలని బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం బీసీ జాగృతి సేన నారాయణపేట నియోజకవర్గం అధ్యక్షుడు ఎల్ల కుర్మయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల లోపు రాష్ట్రవ్యాప్తంగా సమగ్రకులాల గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. సమగ్ర కులగణన అంశాన్ని అటకెక్కించి సమగ్ర కుటుంబ సర్వే ద్వారా బీసీ గణన చేపడతామని ప్రకటించడం నమ్మశక్యంగా లేదన్నారు. బీసీలకు జనాభా దామాషా నిష్పత్తిన స్థానిక సంస్థలు ఎన్నికలతోపాటు, విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, ఉపాధి, పారిశ్రామికరంగాలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయకూడదని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ జాగృతి సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, ఎల్ల కురుమయ్య, గణేష్, మహేష్, మొగులప్ప, దత్తు,వెంకటేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బీసీల చైతన్యానికి త్వరలో పాదయాత్ర

వనపర్తి: బీసీల చైతన్యానికి త్వరలో ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా పాదయాత్ర చేయనున్నట్లు బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ప్రకటించారు. ఆదివారం జిల్లాకేంద్రంలో బీసీ నాయకులతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని బీసీల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల కులగణనకు కృషి చేస్తోందని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీసీలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు రిజర్వేషన్లు పెంచే ప్రయత్నం చేస్తున్నా కొన్నివర్గాలు అణగదొక్కుతున్నాయని చెప్పారు. త్వరలో నిర్వహించే పాదయాత్ర కోసం రూట్‌మ్యాప్, అభిప్రాయాలపై మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాస్‌గౌడ్, బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వీవీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కురుమూర్తి జాతరలో విషాదం

● కోనేరులో పడి యువకుడు మృతి


మృతి చెందిన నరేష్

చిన్నచింతకుంట: కోనేరులో పడి యువకుడు మృతి చెందిన ఘటన చిన్నచింతకుంట మండలం కురుమూర్తి స్వామి జాతర ప్రాంగణంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై ఆర్ శేఖర్ వివరాల ప్రకారం.. దేవరకద్ర మండలం గద్దెగూడం గ్రామానికి చెందిన ఉప్పరిదొబ్బ నరేష్ (27) కురుమూర్తి స్వామి జాతర ఉత్సవాలకు వచ్చాడు. ఆదివారం తెల్లవారు జామున కోనేరులో స్నానం చేసేందుకు వెళ్లి కోనేరులో పడి మృతి చెందాడు. ఇట్టి విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. మృతుడి తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: నాగనూలు చెరువులో దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. నాగనూలు గ్రామానికి చెందిన పెద్దపులి శాంతమ్మ(44) ఆదివారం నాగనూలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు పోలీసులకు, అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. వివాహిత మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

జడ్చర్ల: మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన మామిళ్ల చెన్నయ్య(65) చేపల వేటకెళ్లి ప్రమాదశాత్తు చెరువులో మునిగి మృత్యువాత పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాలు.. పోలేపల్లి సమీపంలోని కొత్తకుంటలో చేపల కోసం శనివారం మృతుడు వల వేసి పెట్టాడు. ఆదివారం చెరువులో వేసిన వలలో పడిన చేపలను బయటకు తీసేందుకు చెరువులోకి దిగాడు. ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకోవడంతో నీటమునిగి మృతిచెందాడు. మృతుడికి భార్య జయమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కేటీదొడ్డి: గద్వాల–రాయచూర్ ప్రధానరోడ్డుపై కారు, బైక్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కుచినెర్ల గ్రామానికి చెందిన చాకలి చిన్నదేవప్ప(45) అనే వ్యక్తి గద్వాల నుంచి కుచినెర్ల వైపు బైక్‌పై వెళ్తున్నాడు. రాయచూర్ వైపు నుంచి గద్వాలకు వస్తున్న కారు కేటీదొడ్డి–నందిన్నె గ్రామాల మధ్యన బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న చాకలి చిన్న దేవప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్యతోపాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు. కారులో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మరో వ్యక్తి..

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్ట గ్రామ సమీపంలో జాతీయ రహదారి44పై ఆదివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓవ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. 45 నుంచి 50ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి రోడ్డు దాటుతుండగా కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆవ్యక్తి శరీర భాగాలన్నీ ఛిద్రమయ్యాయి. మృతుడి శరీరంపై నీలిరంగు లైన్లో కలర్‌ఫుల్ షర్టు, తెల్లని లుంగీ, బ్లూ కలర్ సంచి ఉందన్నారు. మృతదేహాన్ని వనపర్తి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


కలీం (ఫైల్)

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండలంలోని మోతిఘనాపూర్ గ్రామానికి చెందిన కలీం(27) అనే యువకుడు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం బాలానగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో కలీం పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. పోలీసులు మంటలార్పి చికిత్స కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక ఆదివారం మృతిచెందాడు.

ఆదర్శం.. ఆ గ్రామం

రాయిచేడ్‌లో 18 ఏళ్లుగా మద్యం విక్రయాలు నిషేధం


రాయిచేడ్ గ్రామం

● చిన్న ఊరైనా.. మంచి నిర్ణయం
● గతంలో నిత్యం గొడవలు, పోలీసు కేసులే..
● ప్రశాంత జీవనం గడుపుతున్నామంటున్న గ్రామస్తులు

ఉప్పునుంతల: ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని రాయిచేడ్‌లో మాత్రం గ్రామస్తులు పట్టుదలతో 18 ఏళ్లుగా మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తున్నారు. ఆ రోజు గ్రామస్తులు, యువత తీసుకున్న నిర్ణయంతో నేడు ఆ గ్రామంలో ప్రశాంతత నెలకొంది. తాగుడుకు బానిసైన వారు కూడా మద్యం మాని వ్యవసాయ పనులు చేసుకుంటూ తమ కుటుంబాలను చక్కగా పోషించుకుంటున్నారు. రాయిచేడ్ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తూ అందరి మెప్పు పొందుతోంది.

నేడు ప్రశాంత వాతావరణం..

గ్రామంలో మద్యపాన నిషేధం అమలు కావడంతో తాగుబోతులు కూడా నేడు మద్యం మానేసి ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు. దీంతో గ్రామంలో ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకపోవడంతో ప్రశాంత వాతావరణం నెలకొంది. పోలీసు కేసులు కూడా పూర్తిగా తగ్గిపోయాయి. కట్టుబాటును అతిక్రమించకుండా గ్రామపెద్దలు చర్యలు తీసుకుంటున్నారు.

అప్పట్లో నిత్యం పంచాయితీలే..

రాయిచేడ్‌లో సుమారు 180 కుటుంబాలు, 900 వరకు జనాభా ఉంది. అప్పట్లో ఈ గ్రామంలో మద్యం, సారా విక్రయాలు జోరుగా సాగేవి. సారా బట్టీలు ఊర్లోనే పెట్టడంతో కొందరు తాగుడుకు బానిస వ్యవసాయ పనులకు వెళ్లేవారు కాదు. రోజు ఏదో ఒక పంచాయితీ జరుగుతూనే ఉండేది. భార్యాభర్తల మధ్య గొడవలు తలెత్తి కుటుంబాలు కూలే స్థితికి చేరాయి. వివాదాలకు మూలమైన మద్యాన్ని గ్రామం నుంచి దూరంగా తరిమేయాలనే ఆలోచన కొందరు గ్రామపెద్దలు, యువతకు తట్టింది. అనుకున్నదే తడువుగా వారంతా గ్రామంలో సమావేశమై సారా, మద్యం విక్రయాలు ఊరిలో జరపరాదని తీర్మానం చేసుకున్నారు. దుకాణదారులు, విక్రయదారులకు వారం గడువిచ్చి మద్యం విక్రయాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నాటి నుంచి నేటి వరకు ఆ ఊర్లో శీతల పానియాలు తప్పా మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధం.

తాగుడు మానేయడంతో..



గ్రామంలో మద్యం విక్రయాలు నిషేధించడంతో రైతులు తాగుడు మానేసి వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. దీంతో గొడవలు కూడా పూర్తిగా తగ్గిపోయాయి. గతంలో ఊర్లో సారా అమ్మేటప్పుడు రైతులు, కూలీలు రోజు తాగుతూ వ్యవసాయ పనులకు వెళ్లకపోయేది. తరచూ గొడవలు జరిగేవి. ఇప్పుడు అలాంటి సమస్యలు లేవు. అందరం మంచిగా బతుకుతున్నాం.

– కొర్ర బాలు, గ్రామస్తుడు, రాయిచేడ్

ఎలాంటి గొడవలు లేవు..



ఊర్లో సారా, మద్యం విక్రయాలు లేకపోవడంతో ఎలాంటి గొడవలు లేకుండా ఉన్నాం. ఎవరైనా బంధువులొస్తే మాత్రం ఇతర గ్రామానికి తీసుకెళ్లి వారికి మర్యాద చేయాల్సిందే కాని ఇంటికి మాత్రం మద్యం తీసుకొచ్చే అవకాశమే లేదు.

– ఎత్తపు ఊశమ్మ, గ్రామస్తురాలు

గ్రామంలో ప్రశాంతత..



గ్రామంలో మద్యపాన నిషేధం కొనసాగుతుండటంతో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉంటుంది. ఏవైనా సమస్యలు తలెత్తితే గ్రామపెద్దలు చెబితే ఇరువర్గాల వారు విని పరిష్కరించుకుంటున్నారు. ప్రస్తుతం మా ఊరి ప్రజలు గొడవ పడి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం లేదు. ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఆదర్శ గ్రామానికి నేను సర్పంచ్‌గా పనిచేసినందుకు గర్వంగా ఉంది.

– గొడుగు బాల్‌లింగయ్య, మాజీ సర్పంచ్

సెట్విన్ జాడేదీ?


సెట్విన్ కేంద్రం ఏర్పాటుకు పరిశీలించిన భవనం ఇదే

జడ్చర్లకు కేటాయించినా ఏర్పాటు చేయని వైనం

● ప్రకటనలకే పరిమితం
● నిరుద్యోగ యువతకు తప్పని ఎదురుచూపులు

జడ్చర్ల: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడం.. నామమాత్రపు ఫీజులతో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకుగాను జడ్చర్లకు కేటాయించిన సెట్విన్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్, ట్రెనింగ్ ఇన్ ట్విన్ సిటీస్) కేంద్రం ఏర్పాటు కలగానే మారింది. 1978లో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సెట్విన్‌ను ఏర్పాటు చేయగా.. 2007 నుంచి గ్రామీణ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు జిల్లాలకు విస్తరించింది. అందులో భాగంగా 2024–25 సంవత్సరం రాష్ట్రంలో కొత్తగా జహీరాబాద్‌తో పాటు జడ్చర్లలో సెట్విన్ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి ప్రకటించారు. దీంతో జడ్చర్ల ప్రాంతంలోని నిరుద్యోగ యువత సెట్విన్‌పై ఆశలు పెంచుకుంది. ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్‌లో శిక్షణ పొంది సర్టిఫికెట్ తీసుకుంటే రాష్ట్రీయ, జాతీయ స్థాయిలో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పెంచుకోవచ్చని భావించారు. కానీ నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు సెట్విన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

పలు కోర్సుల్లో శిక్షణ..

రోజురోజుకూ పెరుగుతున్న సాంకేతికతకు అనుగుణంగా నిరుద్యోగ యువతలో వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు సెట్విన్ కేంద్రం దోహదపడనుంది. ప్రధానంగా యువతకు అక్కరకు వచ్చే వృత్తులలో సంతరించుకుంటున్న ఆధునిక సాంకేతికతపై శిక్షణ పొందే అవకాశం లభించేది. మహిళలకు బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైన్, జరీ అల్లడం వంటి ప్రాధాన్యత కోర్సులతో పాటు కంప్యూటర్ ఎడ్యుకేషన్, కంప్యూటర్ హార్డ్ వేర్, ఎయిర్ లైన్ టికెటింగ్, సెల్‌ఫోన్ రిపేర్, స్పోకెన్ ఇంగ్లిష్, ప్రింటింగ్ ప్రెస్, సీసీ కెమెరాల మరమ్మతు, ఏసీ, వాషింగ్ మిషన్, ఆర్ఓ మిషన్స్, కటింగ్ అండ్ టైలరింగ్, డ్రోన్ నిర్వహణ తదితర కోర్సుల్లో శిక్షణ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.


సెట్విన్ కేంద్రం ఏర్పాటుచేసే భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి (ఫైల్)

పరిశీలనకే పరిమితం..

జడ్చర్లలో సెట్విన్ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి స్థానిక జౌకీనగర్‌లో నిరుపయోగంగా ఉన్న గురుకుల భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఎండీ వేణుగోపాల్ గత ఆగస్టులో పరిశీలించారు. అక్టోబర్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తామని కూడా ప్రకటించారు. రాష్ట్రంలో యువతకు సెట్విన్ వివిధ రంగాల్లో మెరుగైన శిక్షణ అందిస్తుందని.. సెట్విన్ సంస్థలో శిక్షణ పొందిన వారు దేశవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారని వెల్లడించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 23 కేంద్రాల ద్వారా శిక్షణ అందిస్తున్నామని, వీటితో పాటు జహీరాబాద్, జడ్చర్లలో కొత్తగా తమ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే జడ్చర్లలో సెట్విన్ కేంద్రాన్ని ఏర్పాటుచేసి, నిరుద్యోగ యువతకు తోడ్పాటు అందిస్తామన్నారు. అయితే ఇప్పటి వరకు సెట్విన్ కేంద్రం అడుగు ముందుకు పడకపోవడం శోచనీయం. సెట్విన్ కేంద్రం ఏర్పాటుచేసే పాత గురుకుల భవనంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 20 లక్షలు అవసరమవుతాయని పీఆర్ డీఈ విజయ్‌శేఖర్ తెలిపారు. అందుకు సంబంధించి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతిపాదనలు తయారు చేసి నివేదించినట్లు వివరించారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి సెట్విన్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని నిరుద్యోగ యువత విజ్ఞప్తి చేస్తోంది.

వివాహేతర బంధానికి అడ్డొస్తున్నాడని..

అన్నను హతమార్చిన తమ్ముడు

● తిమ్మాజిపేట మండలం రాళ్లచెరువు తండాలో ఘటన


సభావత్ శ్రీను (ఫైల్)

తిమ్మాజిపేట: తోడబుట్టిన అన్న భార్యతో వివాహేతర బంధం పెట్టుకోవడమే కాకుండా.. అడ్డుగా ఉన్నాడని అన్నను హతమార్చాడో తమ్ముడు. ఈ ఘటన తిమ్మాజిపేట మండలం రాళ్లచెరువు తండాలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్‌రెడ్డి వివరాల మేరకు.. రాళ్లచెరువు తండాకు చెందిన సభావత్ శ్రీను (40), గోపాల్ అన్నదమ్ముళ్లు. కొంతకాలంగా జులాయిగా తిరుగుతున్న గోపాల్.. తన అన్న భార్య శాంతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న శ్రీను ఇటీవల వారిద్దరిని మందలించాడు. ఈ క్రమంలో తమకు అడ్డుగా ఉన్న శ్రీనును ఎలాగైనా హతమార్చాలని పథకం రచించారు. శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న శ్రీను తలపై గోపాల్ కర్రతో బలంగా మోది హతమార్చాడు. అనంతరం అదే తండాలో నివాసముంటున్న తన అత్తగారి ఇంటి ఎదుట మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం తండాకు చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల మార్చురీకి తరలించారు. మృతుడికి పదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి అత్త పాత్లావత్ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



కేటీదొడ్డి: కర్ణాటకలోని రాయిచూర్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం కేటీదొడ్డి పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. గద్వాల నుంచి రాయిచూర్ వైపు బొలెరో వాహనంలో నలుగురు వివిధ గ్రామాల నుంచి 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం సేకరించి రాయిచూర్‌కు తరలిస్తుండగా పోలీసులు మండలంలోని మైలగడ్డ శివారులో పట్టుకుని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. నిందితులు బాలస్వామి, లక్ష్మీనారాయణ, రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాల్వలో పడి గేదెలు మృతి

ధన్వాడ: మండలంలోని రామకిష్టాయిపల్లి గ్రామంలో నీరు తాగేందుకు వెళ్లిన గేదెలు ప్రమాదవశాత్తూ కాల్వలో పడి మృతిచెందాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రామకిష్టాయిపల్లికి చెందిన రైతు చిన్నకృష్ణయ్యకు చెందిన 15 బర్రెలు నీరు తాగేందుకు జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు వెళ్లే కెనాల్ వద్దకు వెళ్లాయి. నీటి ప్రవాహానికి అవి కొట్టుకుపోతుండగా స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించి ఎనిమిది గేదెలను కాపాడారు. ఏడు బర్రెలు మాత్రం మృతిచెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కృష్ణయ్య వేడుకుంటున్నాడు.

ప్రాణం ఖరీదు రూ.6 లక్షలు

● వలస కూలీ ప్రాణానికి వెలకట్టిన వైనం

అమరచింత: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఓ వలస కూలీకి పంచాయతీ నిర్వహించి రూ.6 లక్షలు వెల కట్టారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. ప్రకాశం జిల్లా ఎర్రగొండుపాలెం కొంత మంది కార్మికులు కృష్ణవేణి చెరుకు ఫ్యాక్టరీకి చెరుకు కోతల కోసం వలస వచ్చారు. వీరిలో ఒక బ్యాచ్‌ను మస్తీపురంలో చెరుకు కోతల కోసం పంపారు. శనివారం రైతు పొలంలో చెరుకును కోసిన కూలీలు వాటిని ట్రాక్టర్‌లో లోడ్ చేసి ట్రాక్టర్ పక్కనే నిల్చొని తాడు కడుతుండగా మస్తీపురం గ్రామానికి చెందిన వ్యక్తులు మోటార్ బైక్‌పై వచ్చి బలంగా ఢీకొట్టడంతో ఏసుదానం అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ వ్యవహారంలో బైక్ నడిపిన వ్యక్తులు మైనర్ కావడంతో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి రూ.6 లక్షలు పరిహారంగా చెల్లిస్తామని పంచాయతీలో తీర్మానించారు. అలాగే ఫ్యాక్టరీ ద్వారా చనిపోయిన వ్యక్తికి ఇన్సూరెన్స్ డబ్బులు రూ.3 లక్షలు చెల్లిస్తామని కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ ఏజీఎం పాండురంగారావు పంచాయతీ పెద్దలకు హామీ ఇచ్చారు. దీంతో పంచాయతీ పెద్దలు ఏసుదానం భార్య చిట్టెమ్మ, కుమారుడు రుబిజానులకు తక్షణ సహాయంగా రూ.లక్ష అందజేశారు. అయితే ప్రైవేట్ పంచాయతీ నిర్వహించి ప్రాణానికి వెలకట్టడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కొత్తిమీర సాగు.. లాభాలు బాగు

పాడి–పంట
ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య

కొత్తకోట రూరల్: ప్రస్తుత పరిస్థితుల్లో స్వల్పకాలిక పంటల సాగుకు మొగ్గుచూపాలి. ఇందుకు కొత్తిమీర సాగు ఉత్తమం. ఈ పంటను ప్రతి 15 రోజులకు ఓసారి మార్కెట్‌లో విక్రయించి ఆదాయం పొందవచ్చు. ఏడాదంతా ఆదాయం లభిస్తుంది. కొత్తిమీరకు మార్కెట్‌లో ఎప్పుడూ గిరాకీ ఉంటుంది. తక్కువ నీటితో సాగు చేసుకోవచ్చు. చీడపీడల సమస్య తక్కువే. ధనియాల పంటకైతే రకాన్ని బట్టి సాగుకాలం మారుతుంది. కొత్తిమీర ఒక నెలలోనే చేతికొస్తుంది.

నేలలు.. వాతావరణం...

మురుగు నీరు పోయే సౌకర్యం ఉన్న ఇసుక, ఒండ్రు నేలలు పంట సాగుకు అనుకూలం. వర్షాధార పంటకు ఒండ్రు నేలలైతే మేలు. ఉదజని సూచిక 6–8 మధ్య ఉండాలి. 20 నుంచి 25 డిగ్రీల ఉష్ణోగ్రత అనుకూలం. మంచు రహిత, చల్లటి, పొడి వాతావరణంలో ఆకుల అభివృద్ధి బాగుంటుంది.

రకాలు..

స్వాతి : 80 నుంచి 85 రోజులు పంట కాలం. బూజు తెగులు తట్టుకుంటుంది. దిగుబడి హెక్టారుకు 900 కిలోలు.

సింధు : మధ్యకాలిక పంట. 95 నుంచి 100 రోజుల పంటకాలం. గింజ మధ్యస్థంగా ఉంటుంది. దిగుబడి హెక్టారుకు 1,050 కిలోలు.

సాధన : మధ్యకాలిక పంట. 70 సెం.మీ. వరకు పెరుగుతుంది. గింజలు, ఆకుల కోసం సాగు చేయవచ్చు. పేనుబంకను తట్టుకుంటుంది. నల్లరేగడి నేలల్లో దిగుబడి ఎక్కువ. దిగుబడి హెక్టారుకు 1000 నుంచి 1100 కిలోలు.

సుధ : 80 నుంచి 89 రోజుల పంట. గింజలు మధ్యస్థ పరిమాణంలో ఉంటాయి. దిగుబడి హెక్టారుకు 850 నుంచి 1200 కిలోలు.

సురుచి : 35 నుంచి 55 రోజుల్లో కోతకొస్తుంది. హెక్టారుకు 2.50–4.5 టన్నుల కొత్తిమీర వస్తుంది.


కొత్తిమీర సాగు పంట

సుస్థిర : 85 నుంచి 90 రోజుల పంటకాలం. వర్షాధారంగా సాగు చేస్తే హెక్టారుకు 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

విత్తనశుద్ధి..

హెక్టారుకు 1.5 కిలోల అజోస్పైరిల్లం జీవన ఎరువుతో విత్తనశుద్ధి చేస్తే మొక్కల సాంద్రత పెరుగుతుంది. వర్షాధార పంటలో నీటిఎద్దడిని తట్టుకునేందుకు లీటరు నీటిలో 10 గ్రాముల పొటాషియం డైహైడ్రోజన్ పాస్ఫేట్‌ను కలిపి తయారు చేసిన ద్రావణంలో 16 గంటల పాటు శుద్ధి చేయాలి. కిలో విత్తనానికి నాలుగు గ్రాముల ట్రైకోడర్మా విరిడితో విత్తనశుద్ధి చేస్తే వడల తెగులు నుంచి కాపాడుకోవచ్చు.

విత్తన మోతాదు..

సాగునీటి ఆధారమైతే హెక్టారుకు 10 నుంచి 15 కిలోలు.. వర్షాధారమైతే 20 నుంచి 25 కిలోల విత్తనం అవసరం. 15 నుంచి 30 రోజుల పాటు నిల్వ ఉంచితే బాగా మొలకెత్తుతాయి. 12 గంటల నుంచి 24 గంటల పాటు నీటిలో నానబెట్టినా మొలక శాతం ఎక్కువ. విత్తనాన్ని చేతితో రెండుగా విడదీసి నాటాలి. వరుసల మధ్య 30 నుంచి 40 సెం.మీ. మొక్కల మధ్య 15 సెం.మీ దూరంతో విత్తనాలు నాటాలి. 3 సెం.మీ లోతులోనే నాటాలి. 10 నుంచి 15 రోజుల్లో విత్తనం మొలకెత్తుతుంది.

సస్యరక్షణ..

పేనుబంక: లీటరుకు 2 మి.లీ. మిథైల్‌డెమటాన్ లేదా డైమిథోయేట్ పిచికారి చేయాలి.

బూజు తెగులు: కిలో విత్తనానికి 10 గ్రాముల చొప్పున సూడో మోనాస్ ఫ్లోరిసెన్స్‌తో విత్తనశుద్ధి లేదా లీటరుకు 2 గ్రాముల చొప్పున పైపాటుగా పిచికారి చేయాలి. హెక్టారుకు కిలో చొప్పున తడి గంధకం లేదా హెక్టారుకు 250 మి.లీ. చొప్పున డినోక్యాప్‌ను మొదట తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే ఒకసారి, 10 రోజుల తర్వాత మరోసారి పిచికారి చేయాలి. 5 శాతం వేపగింజల కషాయం సైతం పిచికారి చేసి తెగులును నిర్మూలించవచ్చు.

వడ తెగులు: హెక్టారుకు 5 కిలోల సూడో మోనాస్ ఫ్లోరిసన్స్‌ను నేలలో వేసి నియంత్రించవచ్చు.

గింజ బూజు: గింజ కట్టిన 20 రోజుల తర్వాత హెక్టారుకు 500 గ్రాముల చొప్పున కార్బండిజం పిచికారి చేసి నివారించవచ్చు.

ఎరువులు..

చివరి దుక్కిలో ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు వేయాలి. సాగునీటి ఆధారంగా అయితే హెక్టారుకు 30 కిలోల నత్రజని, 40 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వాడాలి. అదే వర్షాధారంగా అయితే 20 కిలోల నత్రజని, 30 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌లనిచ్చే ఎరువులు వాడాలి. నీటివసతి ఉంటే నాటిన 30 రోజుల తర్వాత 15 రోజుల వ్యవధిలో తేమను బట్టి నీటి తడులివ్వాలి.

అంతర కృషి...

30 రోజుల్లోపు కలుపు తీయాలి. కుదురుకు రెండు మొక్కలు మాత్రమే ఉంచి, మిగతా వాటిని తీసివేసి పలుచన చేయాలి.

తిట్ల పురాణాలతో ప్రజల తిప్పలు తీరవు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

వీపనగండ్ల: రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తిట్ల పురాణం కొనసాగుతుందని.. వాటితో ప్రజల తిప్పలు తీరవని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం వీపనగండ్లలో నిర్వహించిన సీపీఎం జిల్లా 3వ మహాసభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. 400 హామీల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీ కొనసాగినా.. అదనపు బస్సులు లేక మహిళలు, పురుషులు అవస్థలు పడుతున్నారన్నారు. మూసీ సుందరీకరణ, చెరువుల ఆక్రమణ పేరుతో ఇళ్లను కూలుస్తున్న ప్రభుత్వం.. మొదట రియల్టర్లకు అనుమతులు ఇచ్చిన కలెక్టర్, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మూసీ నదిని కలుషితం చేస్తున్న ఫార్మా కంపెనీలపై చర్యలు తీసుకోకుండా, 15వేల మంది పేదలు నిర్మించుకున్న ఇళ్లను కూల్చాలని చూడటం అన్యాయమని అన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించి రూ. 31వేల కోట్లకుగాను రూ. 18వేల కోట్ల రుణాలను మాత్రమే మాఫీ చేసి చేతులు దులుపుకొనేందుకు ప్రయత్నిస్తుందని ఆయన విమర్శించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు అసలు సమస్యలను పక్కదారి పట్టించే విధంగా తిట్ల పురాణాలతో డైవర్ట్ రాజకీయాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల సమయంలో వామపక్ష పార్టీల ఓట్లను ఆశించిన రాష్ట్ర ప్రభుత్వం.. ప్రజా సమస్యల గురించి ప్రశ్నించే కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదానీ, అంబానీలకు రూ. వేల కోట్లు పంచిపెడుతూ, మతాల మధ్య చిచ్చుతో అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తుందని ఆయన విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీ లేకపోతే దేశానికి భవిష్యత్ లేదని.. పేదల సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ ఎర్రజెండా ముందుకు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో సాగర్, వెంకట్, జాన్‌వెస్లీ, రాంరెడ్డి, పి.గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జబ్బార్, బాల్‌రెడ్డి, మౌలాలి, కృష్ణయ్య, బాలస్వామి, ఆశన్న, మురళీ, వెంకటేశ్వర్లగౌడ్, వెంకటయ్య, ఈశ్వర్ పాల్గొన్నారు.

నెట్‌బాల్‌లో పాలమూరు ప్రతిభ


ట్రెడిషనల్ బాలుర విభాగంలో విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు

నిర్మల్ జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈనెల 8 నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్–16 సబ్ జూనియర్స్ బాలబాలికల ఫాస్ట్–5, ట్రెడిషనల్ నెట్‌బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ట్రెడిషనల్ బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు విజేతగా నిలవగా.. నారాయణపేట రన్నరప్ సాధించింది. బాలికల విభాగంలో నల్లగొండ చేతిలో పాలమూరు ఓడి రన్నరప్‌గా నిలిచింది. ఇక ఫాస్ట్–5 బాలుర విభాగంలో నారాయణపేట, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ రన్నరప్ సాధించాయి.

– నిర్మల్‌టౌన్

నేడు ఏపీ పూర్తి స్థాయి బడ్జెట్

కూటమి ఎన్నికల హామీలు, సూపర్ సిక్స్, రెడ్‌బుక్ అరాచకాలపై జనం ప్రశ్నిస్తుండటంతో డైవర్షన్ రాజకీయాలే లక్ష్యంగా అజెండా

సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజల కళ్లుగప్పటం... రాష్ట్రంలో జరుగుతున్న అఘాయిత్యాలపై ఎవరూ ప్రశ్నించకుండా రెడ్‌బుక్ అమలుతో దృష్టి మళ్లింపు రాజకీయాలే లక్ష్యంగా సాగుతున్న సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు సోమవారం శాసనసభలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. నేడు ఉదయం 9 గంటలకు అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశమై బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలపనుంది. అనంతరం ఉదయం 10 గంటలకు అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. శాసన సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అదే సమయానికి శాసన మండలిలో గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్‌ను చదువుతారు. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టడం పూర్తి అయిన అనంతరం వ్యవసాయ బడ్జెట్‌ను ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సభలో ప్రవేశపెడతారు. మండలిలో మంత్రి నారాయణ వ్యవసాయ బడ్జెట్‌ను చదువుతారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా మభ్యపెడుతున్న కూటమి సర్కారు అసెంబ్లీ సమావేశాలను సైతం డైవర్షన్ రాజకీయాలకే వినియోగించుకోవాలని ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై యథేచ్ఛగా జరుగుతున్న అఘాయిత్యాలు, లైంగిక దాడులు, హత్యలు, శాంతి భద్రతల వైఫల్యం నుంచి దృష్టి మళ్లించేందుకు.. ఇప్పుడే కొత్తగా సోషల్ మీడియాలో పోస్టులు వచ్చినట్లు, వాటిపైనే చర్చించాలనే వైఖరితో ప్రభుత్వం ఉందనే అభిప్రాయాన్ని అధికార వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. పలుచోట్ల మైనర్ బాలికలు అత్యాచారాలు, హత్యలకు గురి కావడం నుంచి దృష్టి మళ్లించడమే లక్ష్యంగా సోషల్ మీడియా పోస్టులపై ప్రభుత్వ పెద్దలు ఇటీవల గగ్గోలు పెడుతున్నారు. ఇదే అంశాన్ని అసెంబ్లీలో కూడా ప్రస్తావించాలని సన్నద్ధమైనట్లు సమాచారం. మరోపక్క సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బడ్జెట్ సమావేశాల్లో గత సర్కారుపై ఆరోపణలు, నిందలు మోపేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేసినట్లు తెలుస్తోంది.

పోర్టులు, మెడికల్ కాలేజీలు అమ్మేస్తూ..

సీ–ప్లేన్‌తో రాష్ట్రాభివృద్ధా?

చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్





- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.13,254.05 కోట్లతో మూడు పోర్టుల నిర్మాణం
- రూ.8,480 కోట్లతో అత్యాధునిక వైద్యం, కొత్తగా 17 మెడికల్ కాలేజీలు
- ఇదంతా అభివృద్ధి కాదా? సంపద సృష్టి కాదా?
- ఈ ఆస్తులు విలువ భవిష్యత్తులో రూ.లక్షల కోట్లు కాదా?



సాక్షి, అమరావతి : 'సీ ప్లేన్ నడిపితే రాష్ట్రాభివృద్ధి జరిగిపోయినట్లా?' అని సీఎం చంద్రబాబును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. దేశంలో తొలిసారిగా సీ ప్లేన్ నడిపినట్టుగా చంద్రబాబు బిల్డప్ ఇస్తుండటం.. అందుకు ఎల్లో మీడియా డప్పు కొడుతుండటం చూస్తుంటే పిట్టల దొర డైలాగ్‌లు గుర్తుకొస్తున్నాయని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల సంపదగా నిర్మిస్తూ సృష్టించిన మెడికల్ కాలేజీలు, పోర్టులను ప్రయివేటుపరం చేస్తూ, స్కాంలు చేస్తూ తన మనుషులకు తెగనమ్ముతూ.. వీటన్నింటిపై ప్రజల్లో చర్చ జరగకూడదనే సీ ప్లేన్‌తో అభివృద్ధి జరిగిపోయినట్లు పబ్లిసిటీ స్టంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ దుర్మార్గపు చర్యలను చివరకు ప్రజలు తప్పక నిలదీస్తారని, ఈ ప్రభుత్వాన్ని ఎండగడతారని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..





1 చంద్రబాబు గురించి చెప్పాలంటే.. మాయ చేస్తాడు, మభ్యపెడతాడు, చివరకు ప్రజలను మోసం చేస్తాడు. ఇందుకోసం ఎన్ని వేషాలు వేయాలో అన్ని వేషాలూ వేస్తాడు. తాజాగా విజయవాడ నుంచి శ్రీశైలం వరకూ సీ ప్లేన్ ద్వారా చేసిన పర్యటన ఇలాంటిదే. సెల్ ఫోన్ తానే కనిపెట్టానని, కంప్యూటర్లు కూడా తానే కనిపెట్టానని రెండు దశాబ్దాలుగా కబుర్లు చెబుతున్న చంద్రబాబు, ఇప్పుడు సీ ప్లేన్ మీద కూడా కహానీలు మొదలెట్టేశారు. దేశంలోనే తొలిసారి అన్నట్టుగా, మరెక్కడా లేదన్నట్టుగా, సీ ప్లేన్ నడిపితే చాలు రాష్ట్రాభివృద్ధి జరిగిపోయినట్లుగా బిల్డప్ ఇస్తున్నారు.

2 సీ ప్లేన్ అన్నది ఇప్పటిది కాదు. దాదాపు 114 ఏళ్ల క్రితమే 1910లో నడిచింది. మన దేశంలో కేరళలో 2013లో మొదలయ్యి తర్వాత నిలిపేశారు. గుజరాత్‌లో 2020లో సర్వీసులు నడవటం మొదలుపెట్టినా అవికూడా పలుమార్లు నిలిచిపోయాయి. ప్రతి రాష్ట్రంలోనూ అనేక రిజర్వాయర్లు, డ్యాంలు ఉన్నాయి. మరి ఎందుకు ఆయా రాష్ట్రాల్లో ఇలాంటి ప్రయోగాలు కొనసాగడం లేదు?

3 ఆపరేషన్స్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాంకేతిక సమస్యలు, ప్రయాణికుల భద్రతాపరమైన అంశాలతోపాటు నిర్వహణా భారం దీనికి ప్రధాన కారణాలని అనేక మీడియా సంస్థలు కథనాలను ప్రచురించాయి. ఇలాంటి 14 మంది ప్రయాణికుల సీ ప్లేన్ సర్వీసులను అభివృద్ధికి ఒక ప్రమాణంగా చంద్రబాబు గొప్పగా చెప్పుకోవడం, దాన్ని ఎల్లో మీడియా కీర్తించడం.. పరస్పరం డప్పాలు కొట్టుకోవడం కాదా?

4 సంపద సృష్టించడమంటే ప్రభుత్వ రంగంలో పోర్టులు నిర్మించి, తద్వారా అభివృద్ధి చేసి.. ప్రభుత్వానికి ఆదాయం కల్పించడం. ప్రభుత్వ రంగంలో మెడికల్ కాలేజీలు కట్టి, ప్రజలకు అందుబాటులో ఉచితంగా నాణ్యమైన, అత్యాధునిక వైద్యాన్ని అందించడం. ఇలాంటివి కాకుండా సీ ప్లేన్ మీద పబ్లిసిటీ స్టంట్లు ఏమిటి?

5 చంద్రబాబూ.. రూ.8,480 కోట్లతో ప్రభుత్వ రంగంలో, మారుమూల ప్రాంతాల్లో అత్యాధునిక వైద్యాన్ని అందుబాటులోకి తెస్తూ, తద్వారా మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రిని తీసుకొస్తూ, కొత్తగా 17 మెడికల్ కాలేజీలు కట్టడం సంపద సృష్టి అవుతుందా? లేక వాటిని ప్రయివేటు పరం పేరుతో మీ మనుషులకు స్కామ్‌లు చేస్తూ అమ్మాలనుకోవడం సంపద సృష్టి అవుతుందా?

6 సుదీర్ఘ తీర ప్రాంతాన్ని వినియోగించుకుని మెరుగైన వాణిజ్యాన్ని, రాష్ట్రానికి అదనపు ఆదాయాన్ని, ప్రజలకు ఉపాధిని, పారిశ్రామిక ప్రగతిని సాధించడానికి ప్రభుత్వ రంగంలో రూ.4,361.91 కోట్లతో మూలపేట, రూ.5,156 కోట్లతో మచిలీపట్నం, రూ.3,736.14 కోట్లతో రామాయపట్నం వద్ద.. మొత్తంగా మూడు పోర్టులను రూ.13,254.05 కోట్లతో నిర్మిస్తే దాన్ని అభివృద్ధి, సంపద సృష్టి అంటారా? లేక సీ ప్లేన్‌లో తిరిగి ఈ పోర్టుల ఆస్తులను మీ వారికి స్కామ్‌ల ద్వారా తెగనమ్మితే దాన్ని అభివృద్ధి, సంపద సృష్టి అంటారా? ప్రభుత్వ రంగ పోర్టుల వల్ల రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుందా? లేక ఈ సంపద సృష్టించే వనరులను తెగనమ్మడంతో పాటు, సీ ప్లేన్స్ వల్ల రాష్ట్రానికి సంపద పెరుగుతుందా?

7 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, పోర్టుల రూపేణా మొత్తంగా రూ.21,734 కోట్ల పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రజల ఆస్తి కాదా? ప్రజల కోసం సృష్టించిన సంపద కాదా చంద్రబాబూ? రాష్ట్ర చరిత్రలో ప్రభుత్వ రంగంలో ఇన్ని పెట్టుబడులు ఎప్పుడైనా పెట్టారా? మా హయాంలో నిర్మాణాలు జరుపుకున్న కాలేజీలు, పోర్టులన్నీ కూడా ప్రత్యక్ష సాక్ష్యాలుగా ఇవాళ రాష్ట్ర ప్రజల కళ్ల ముందు లేవా? ఇవన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సృష్టించిన సంపద కాదా? ఈ ఆస్తులు విలువ భవిష్యత్తులో రూ.లక్షల కోట్లు కాదా? ఇదంతా అభివృద్ధి కాదా?

8 చంద్రబాబూ.. మీరు, మీ పార్టీ నాయకుల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధిగా.. మీరు, మీమనుషులు ఆస్తులు కూడబెడితే అది ప్రజల కోసం సృష్టించిన సంపదగా చెప్పుకుంటారు. మీ దృష్టిలో అభివృద్ధి, సంపద సృష్టి అంటే ఇదే. మీ పబ్లిసిటీ విన్యాసాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ప్రభుత్వ రంగంలో మంచి స్కూల్స్ లేకుండా చేసి, మంచి వైద్యాన్ని అందించే మెడికల్ కాలేజీలు లేకుండా చేసి, మంచి పోర్టులు లేకుండా చేసి, చివరకు ప్రజల ఆస్తులను వారికి కాకుండా చేసే దుర్మార్గపు చర్యలను ప్రజలు తప్పక నిలదీస్తారు. ఈ ప్రభుత్వాన్ని ఎండగడతారు.

ఒక యూనిట్‌లో విద్యుదుత్పత్తి

ధరూరు/ దోమలపెంట/ మదనాపురం: జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలోని ఒక యూనిట్‌లో విద్యుదుత్పత్తి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టుకు వరద తక్కువగా ఉండటంతో శనివారం విద్యుదుత్పత్తి నిలిపివేసిన అధికారులు ప్రాజెక్టులో వాటర్ లెవెల్స్ పెరగడంతో ఆదివారం ఒక యూనిట్‌ను ప్రారంభించారు. అలాగే ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో 7 వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో విద్యుదుత్పత్తి నిమిత్తం 7,621 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 730, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50, సమాంతర కాల్వకు 1,000, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు వదలగా.. మరో 96 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.604 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో 877.1 అడుగులు..

శ్రీశైలం జలాశయంలో ఆదివారం 877.1 అడుగుల వద్ద 173.8786 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 7,621 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 2,264 మొత్తం 9,885 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తుంది. దీంతో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 21,600 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 11,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,519, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు.

రామన్‌పాడుకు 1,550 క్యూసెక్కులు

రామన్‌పాడు జలాశయంలో ఆదివారం వరకు పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 730 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో ఎన్టీఆర్ కాల్వ ద్వారా 900 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 25 క్యూసెక్కులు, వివిధ లిఫ్టుల ద్వారా 849 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.


జూరాల జలాశయంలో ప్రస్తుత నీటిమట్టం

బాస్కెట్‌బాల్ చాంపియన్ హైదరాబాద్


బాస్కెట్‌బాల్ టోర్నీ బాలుర విజేత హైదరాబాద్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న పాపిరెడ్డి తదితరులు


ట్రోఫీ అందుకుంటున్న బాలికల విభాగంలో రన్నరప్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు

బాలికల రన్నరప్‌గా పాలమూరు జట్టు

- బాలుర రన్నరప్‌గా రంగారెడ్డి
- మూడో స్థానంలో వరంగల్, రంగారెడ్డి జట్లు
- ముగిసిన ఎస్‌జీఎఫ్ అండర్–19 రాష్ట్రస్థాయి టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో హైదరాబాద్ బాలబాలికల జట్లు అద్భుతమైన ప్రదర్శన కనబరిచాయి. రెండు విభాగాల్లో హైదరాబాద్ జట్లు చాంపియన్లుగా నిలవడం విశేషం. బాలుర విభాగం ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 56–28 పాయింట్ల తేడాతో రంగారెడ్డి జట్టుపై విజయం సాధించింది. బాలికల ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 50–23 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొందింది. బాలుర విభాగం మూడోస్థానంలో వరంగల్ జట్టు, బాలికల్లో రంగారెడ్డి జట్టు నిలిచాయి.

అందరి సహకారంతో టోర్నీ విజయవంతం

వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల సహకారంతో జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి అండర్–19 ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ టోర్నీని విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి అన్నారు. టోర్నీలో గెలుపొందిన జట్లకు ఆయన ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది కూడా రాష్ట్రస్థాయి అండర్–19 ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ టోర్నీ నిర్వహిచడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయి టోర్నీలో జట్లు ఎంతో మెరుగైన ప్రదర్శన కనబరచాయన్నారు. క్రమశిక్షణకు మారు బాస్కెట్‌బాల్ క్రీడాకారులు అని కొనియాడారు. ఈనెల 19వ తేదీ నుంచి పంజాబ్ రాష్ట్రం పాటియాలలో జరిగే అండర్–19 ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ టోర్నీ రాష్ట్ర పరిశీలకులు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు ఖాలెద్ అలీ, సుబాన్‌జీ, షరీఫ్, పీడీలు ఫారుఖ్ ముకర్రం, నాగరాజు, డీఎస్‌ఏ బాస్కెట్‌బాల్ కోచ్ ఎండి.ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులో జాతీయ పోటీలు

- 68వ ఎస్‌జీఎఫ్ అండర్–17 హ్యాండ్‌బాల్ టోర్నీ
- 2025, జనవరి నుంచి 10 నుంచి 14 వరకు
- క్రీడాకారుల్లో హర్షాతిరేకాలు


జిల్లాకేంద్రంలో 2018లో జరిగిన ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: జాతీయ క్రీడల నిర్వహణలో పాలమూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2015లో అండర్–14 క్రికెట్, 2016లో అండర్–14 వాలీబాల్, 2017లో అండర్–14 నెట్‌బాల్ టోర్నీ, 2018 ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు అండర్–17 హ్యాండ్‌బాల్ టోర్నమెంట్, అదే ఏడాది డిసెంబర్ 23 నుంచి 26 వరకు అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో టెన్నిస్ వాలీబాల్, అండర్–17, అండర్–19 విభాగాల్లో పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు.

రెండోసారి..

జిల్లాకేంద్రంలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 జాతీయస్థాయి బాలబాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ జరగనుంది. కరోనా తర్వాత మళ్లీ జిల్లాకేంద్రంలో జాతీయస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. జాతీయస్థాయి అండర్–17 ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలు రెండోసారి జరగనున్నాయి. జిల్లాకు నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ కేటాయిస్తూ ఈ నెల 8న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 14 వరకు జిల్లాకేంద్రంలో పోటీలు కొనసాగనున్నాయి.

30కిపైగా రాష్ట్రాల జట్లు హాజరు..

అండర్–17 నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో 30 నుంచి 35 రాష్ట్రాల జట్లు పాల్గొననున్నాయి. ఒక్కో రాష్ట్రం నుంచి 16 మంది క్రీడాకారులు, ఇద్దరు కోచ్‌లు, ఇద్దరు మేనేజర్లు రానున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా రెండోసారి పోటీలకు ఆతిథ్యం ఇస్తుండటంపై సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి జోనల్‌స్థాయి క్రీడా పోటీలు


లింగాల గురుకుల మైదానానికి చేరుకున్న క్రీడాకారులు


గురుకుల ప్రహరీపై క్రీడాకారుల చిత్రాలను చిత్రీకరిస్తున్న విద్యార్థులు

- 13 గురుకులాల నుంచి 1,105 మంది క్రీడాకారుల రాక
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మైదానంలో సోమవారం నుంచి నాలుగు రోజులపాటు 10వ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేశారు. స్పోర్ట్స్ విభాగంలో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, ఖోఖో, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్ పోటీలతో పాటు అథ్లెటిక్స్ విభాగంలో 100, 200, 400, 800, 1,500, 5,000 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని 13 గురుకులాలకు చెందిన 1,105 మంది క్రీడాకారులు ఆదివారమే లింగాల గురుకులానికి చేరుకున్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

మూడవసారి వేదిక..

లింగాల గురుకులం మూడోసారి జోనల్‌స్థాయి క్రీడలకు వేదిక కాబోతుంది. 2014లో మొదటిసారి జోనల్‌స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. అప్పటి క్రీడాశాఖ మంత్రి పి.రాములు, గురుకులాల కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ కృషితో గురుకులానికి పక్కా భవనం మంజూరు చేశారు. ఆ తర్వాత 2022లో రెండవ సారి జోనల్ క్రీడలు నిర్వహించారు. ఇక్కడి గురుకులంలో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుండటంతో ప్రత్యేక గుర్తింపు వచ్చిందని చెప్పవచ్చు. గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అవసరమైన వసతులు ఉండటమే కాకుండా, క్రీడల నిర్వహణకు సువిశాలమైన స్థలం ఉంది. జోనల్‌స్థాయి పోటీల సందర్భంగా గురుకుల ప్రహరీపై క్రీడలు, ప్రముఖ క్రీడాకారులను చిత్రాలను చిత్రీకరించారు. క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ విభాగాలకు సంబంధించి 17 కమిటీలను ఏర్పాటు చేసినట్లు కోఆర్డినేటర్, పీడీ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ బాలస్వామి తెలిపారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి అన్నారు. మేడ్చల్‌లో సోమ, మంగళవారాల్లో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 విభాగం రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా రగ్బీ టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లు ఆదివారం తరలివెళ్లాయి. ఈ సందర్భంగా మెయిన్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా జట్లను శారదాబాయి అభినందించారు. సమష్టిగా ఆడితే పోటీల్లో విజయం సాధించవచ్చని అన్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పీడీలు శ్రీనివాసులు, ఉమాపతిరెడ్డి క్రీడాదుస్తులు అందజేశారు. పెటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, పీడీలు వేణుగోపాల్, నిరంజన్‌రావు, కోచ్ నర్సింలు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాలుర రగ్బీ జట్టు: ఎం.అరుణ్, ఎం.శ్రీకాంత్, కె.చింటూ, పి.శ్రీశైలం, జి.చరణ్‌తేజ, ఖదీర్, పి.గణేష్, క్రిష్ణనాయక్, ఎ.రాంచరణ్, రవి, టి.పవన్‌కుమార్, రఘు.

బాలికల జట్టు: ఎ.మీనాక్షి, ఎం.నగేషా, కె.మౌనిక, ఎం.జ్యోష్న, టి.సంధ్యారాణి, సి.ఉమా, ఎం.నందిని, మనీషా, ఎస్.రాజేశ్వరి, కె.నందిని, కె.రమాదేవి, పి.స్పందన.


ఉమ్మడి జిల్లా రగ్బీ జట్లతో ఎస్‌జీఎఫ్ అధికారులు